
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 13 । జూలై । 2025



సోమశిలలో 28.477 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 28.477 టీఎంసీలు ఉన్నాయి. 1498 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 2700, ఉత్తర,దక్షిణకాలువలకు 775 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,990
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,140
3 శాతం జీఎస్టీతో	రూ.9,414
నవర (8 గ్రా)	రూ.75,312

గరిష్టం/కనిష్టం
39.4 /29.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉండి. ఈదురు గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. శనివారంలో తేమ 40 శాతంగా నమోదైంది.

ఐసీడీఎస్‌లో కమీషన్ల కక్కుర్తి

అంగన్‌వాడీలకు కుళ్లిన గుడ్లు.. మాడిన అటుకులు



పేద కుటుంబాల్లోని గర్భిణులు, బాలింతల తోపాటు అంగన్‌వాడీల్లోని పిల్లల ఆరోగ్యంతో ఐసీడీఎస్ శాఖాధికారులు చెలగాటమాడుతున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకమైన పోషకాహార కిట్లు, సరుకులు సరఫరా చేస్తున్నారు. ఐసీడీఎస్ వారోత్సవాలు, పక్షోత్సవాల పేరుతో పోషకాహారంపై విస్తృత ప్రచారం చేస్తే అధికారులు ఆచరణలో కుక్కలు కూడా ముట్టని రీతిలో ఉండే పోషకాహార సరుకులు ఇవ్వడమే కాకుండా మా దృష్టికి రాలేదు.. చర్యలు తీసుకుంటామంటూ అమాయకంగా చెప్పడం పరిపాటిగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు మీ ఇంటి పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పెడతారా? అని పలువురు మహిళలు నిలదీస్తున్నారు.


- ముక్కిన, పురుగుల రేషన్ బియ్యం సరఫరా
- పోషక కిట్లూ అధ్వానం
- పౌష్టికాహారంలో నాణ్యతకు తిలోదకాలు
- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంతో చెలగాటం

ఉలవపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే నిత్యావసరాలు, ఇతర సరుకులు, పోషక కిట్లలో నాణ్యత కొరవడింది. ఇప్పటికే పలుచోట్ల సరఫరా చేసిన బియ్యం పురుగులు పట్టి, నాసిరకంగా ఉన్నట్లు బయటపడగా, తాజాగా ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే పోషక కిట్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులోని గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు, అటుకులు సరఫరా చేశారు. అవి కనీసం కుక్కలు కూడా ముట్టనంతగా కుళ్లిన గుడ్లు, మాడిపోయిన అటుకులు సరఫరా చేశారు.

ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు పంచాల్సిన కోడిగుడ్లు, అటుకులు గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అందజేశారు. వాటిని ఇంటికి తీసుకుని వెళ్లి చూస్తే అందులో సుమారు 50 శాతం కోడిగుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. ఆ కోడిగుడ్లు పగులగొడితే ఇల్లంతా కంపుకొడుతున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇక అటుకుల విషయానికి వస్తే నల్లగా మారిపోయి ఉండగా, మరి కొన్ని పసుపు వర్ణంలో మురిగిపోయిన వాసన వస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవాలని



అంగన్‌వాడీలో అందించిన కుళ్లిపోయిన కోడిగుడ్లు



నల్లగా ఉన్న అటుకులు

వైద్యులు చెబుతున్నారు. గర్భిణి అంటే లోపలి బిడ్డకు కూడా నాణ్యమైన పోషకాలు అందేలా చూసుకోవాలి. అలాంటి వారికి ఇలాంటి కుళ్లిన గుడ్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. బాలింతలు బిడ్డ పుట్టిన తరువాత మరో జన్మగా భావించి తమ పూర్తి ఆరోగ్యం కోసం మంచి ఆహారం తీసుకోవాలి. అలాంటి వారికి ఇచ్చే వాటిలో కూడా కక్కుర్తి పడి దారుణమైన సరుకులు ఇస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాణ్యతకు పెద్ద పీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల పోషకాహార సరుకులు తీసుకెళ్లే అక్క,చెల్లెమ్మలు తన సొంత తోబుట్టువుల్లా భావించారు. నాణ్యమైన పోషకాహార పదార్థాలు సరఫరా చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు ఫుడ్ కమిషన్ చైర్మన్‌ను నియమించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు ఎక్కడైనా నాణ్యత లేనివి ఇచ్చినట్లు అయితే వెంటనే వారిపై చర్యలు తీసుకునే విధంగా చూశారు. ఆఖరికి కోడిగుడ్డు సైజ్ తగ్గినా సహించకుండా చర్యలు తీసుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. నాణ్యమైన పోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యాన్ని సరఫరా చేసి ఇంట్లో భోజనం చేసినంత తృప్తిని కల్పించారు.

గర్భిణులు, బాలింతలు, పిల్లలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంగా అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకుల సరఫరాకు తిలోకదకాలిచ్చింది. కాంట్రాక్టర్లు, అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నారు. ఉలవపాడు ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 184 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,699 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రేషన్ సరుకులతోపాటు 25 కోడిగుడ్లు, చిక్కీలు, అటుకులు, ఖర్జూరం అందించాలి. ఈ 25 గుడ్లు నాలుగు సార్లుగా అందిస్తారు. తొలి వారంలో నీలం రంగు గుడ్లు, రెండో వారం ఎరుపు రంగు, మూడో వారం పచ్చరంగు, నాలుగో వారం పింక్ రంగు వేసిన గుడ్లు అందించాలి. కానీ తొలి రెండు వారాలు ఇవ్వాల్సిన గుడ్లు ఒకోసారి ముందు కానీ, నెల చివరి వారంలో ఇచ్చేస్తున్నారు. ఈ సరఫరా చేసిన గుడ్లలో దాదాపు సగం గుడ్లు కుళ్లిపోయి ఉన్నాయి. ప్రాజెక్టుకు దూరంగా ఉన్న గుడ్లూరు, లింగసముద్రం మండలాలకు మరీ దారుణమైన గుడ్లను అందించారు. దాదాపు 60 శాతం గుడ్లు పాడయ్యాయి. ప్రాజెక్ట్ ప్రధాన కేంద్రం ఉన్న ఉలవపాడులో కొంత మేర 40 శాతం గుడ్లు పాడైనట్లు సమాచారం. ఇక అటుకులు అధ్వానంగా దుర్వాసన వస్తూ నల్లగా, ఎర్రగా అయిపోయాయి. ప్రభుత్వానికి గర్భిణులు, బాలింతలు అంటే అంత చులకనా అనిపిస్తుంది.

జీతాలు, కమీషన్లపైనే దృష్టి



అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించే ఐసీడీఎస్ అధికారులు ఎంత సేపటికి జీతాలు, అంగన్‌వాడీ సెంటర్ల నుంచి ముడుపులు, సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లపైనే వీరి దృష్టంతా ఉంటుందనే దానికి ఇలాంటి ఘటనలే ఉదాహరణలు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు ఎలా ఉన్నాయని, అంగన్‌వాడీ సిబ్బందితో పరిశీలించి వాటిని తిరిగి పంపించిన ఉదంతాలు ఈ ఏడాదిలో ఒక్కటైనా ఉందా?. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలకు ఐసీడీఎస్ అధికారుల దగ్గర సరైనా సమాధానాలు లేవు. సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించినా వాటిని పరిశీలించాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉంది. గుడ్లు అధ్వానంగా ఉన్నా ఎవరు చెప్పారనే విషయం తెలిస్తే అధికారులు, కార్యకర్తలు సదరు లబ్ధిదారుడిని బెదిరిస్తారన్న భావనతో చాలా మంది బయట పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఉలవపాడు సీడీపీఓ మాధవీలత వివరణ కోరగా గుడ్లు కుళ్లినని నా దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామంటూ సమాధానమిచ్చారు. దీన్ని బట్టి సీడీపీఓ పనితీరును అంచనా వేయొచ్చు. తన పరిధిలో నాసిరకమైన సరుకులు పంపిణీ జరిగినా.. తనకు తెలియదని చెప్పడం ఆమె అసమర్థతకు, నిర్లక్ష్యానికి అద్దం పడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇంటర్నెట్ యజమానులు

- రూ.1.20 లక్షలు స్వాహా
- పోలీసు కేసు నమోదు

అనుమసముద్రంపేట: సైబర్ నేరగాళ్ల వలలో ఇద్దరు ఇంటర్నెట్ సెంటర్ల యజమానులు మోసపోయిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. బాధితులు రవికుమార్, హజరత్తయ్య శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఏఎస్సైనంటూ ఇంటర్నెట్ సెంటర్ల యజమానులకు ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. అర్జెంట్‌గా ఫోన్‌లో అమౌంట్ కావాలని, పాపకు రోడ్డు ప్రమాదం జరిగి వైద్యశాలలో సీరియస్‌గా ఉందని చెప్పడంతో అంత అమౌంట్ లేదని ఆయనకు తెలిపారు. నేను ఏఎస్సైను ఏఎస్‌పేటలో దినేష్ ద్వారా నగదు పంపిస్తానని, ఎక్కడో ఒక దగ్గర మాట్లాడి అర్జెంట్‌గా ఫోన్‌పే చేసి ఆదుకోవాలని బతిమిలాడడంతో ఇద్దరు ఇంటర్నెట్ యజమానులు రూ.1.20 లక్షలను ఆయన పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా ఖాతాకు పంపించారు. అనంతరం ఎంత సేపటికి వీరికి నగదు రాకపోవడంతో దినేష్ అనే వ్యక్తికి ఫోన్ చేశారు. దినేష్ నాకెవరూ డబ్బులు ఇవ్వలేదని ఇంటర్నెట్ యజమానులకు తెలిపాడు. దీంతో సైబర్ నేరంగా గ్రహించి 1930కు కాల్ చేసినా అది పని చేయలేదు. దీంతో శనివారం ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్సై సైదులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో పర్యటించాలి

- భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి

నెల్లూరు రూరల్: తహసీల్దార్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించినప్పుడే సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపగలుగుతారని భూపరిపాలన ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి అన్నారు. శనివారం నెల్లూరులోని కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రీసర్వే, నీటి పన్నుల వసూళ్లు, పీజీఆర్ఎస్ అర్జీల పురోగతి, హౌసింగ్ ఫర్ ఆల్ మొదలైన రెవెన్యూ అంశాలపై చర్చించారు. రెవెన్యూ సిబ్బంది విధుల్లో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ప్రధానంగా రీసర్వే చేపట్టిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంను త్వరగా విడగొట్టి వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. ఇది జరగకపోవడం వల్ల చాలా మంది రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అర్హులైన రైతులకు అందించేందుకు వచ్చే వారంలోగా ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందిస్తున్న ప్రతి అర్జీని పరిష్కరించాలన్నారు. అలా కాకుండా తిరస్కరించిన అర్జీలను ఆడిట్ టీమ్‌లు మరొకసారి పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు అనూష, వంశీకృష్ణ, పావని, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మొదటి రోజు కాకాణి విచారణ పూర్తి

నెల్లూరు (లీగల్): పంటపాళెంలో మద్యం అక్రమ నిల్వలు అక్రమ కేసుపై మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మొదటి రోజు శనివారం విచారణ పూర్తి చేశారు. జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని ఈ కేసులో విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ రెడ్డి శనివారం కస్టడీకి తీసుకుని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించారు. కాకాణి తరపు న్యాయవాది కే శ్రీనివాసులు సమక్షంలో, వెంకటాచలం మండలం నిడుగుంటపాళెం, వెంకటాచలం బిట్-2 వీఆర్వోలు శ్రీపతి మునిరాజు, చల్లా సూర్యకుమార్ మధ్యవర్తులుగా ఉండగా పోలీసులు విచారించారు. తొలి రోజు 35 ప్రశ్నలు వేసి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు ఆదేశానుసారం సాయంత్రం 5 గంటలకు కాకాణి పోలీసులు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. ఆదివారం కూడా కాకాణిని విచారించనున్నారు.

శాసనమండలిలో మీ గొంతుకై పోరాడుతా



రామకృష్ణాపురం వద్ద ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ తూమాటి

- ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు
- కరేడు పరిధిలోని గ్రామాల్లో పర్యటన

ఉలవపాడు: ప్రాణం కంటే మిన్నగా భావించే పచ్చని భూములను కాపాడుకునేందుకు కరేడు రైతులు చేస్తున్న ఉద్యమంలో నేను భాగస్వామ్యం అయి, మీ గొంతుకనై శాసన మండలిలో వినిపించి పోరాడుతానని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు హామీ ఇచ్చారు. శనివారం కరేడు పరిధిలోని కరేడు పరిధిలోని రామకృష్ణాపురం, ఉప్పరపాళెం, పాట్టిళ్ల గుంట, పొల్లుగట్టు సంఘం, ఆకుతోట సంఘం, ఇందిరానగర్ కాలనీ, మర్రిచెట్టు సంఘం, వాక, బాలకోటయ్య సంఘంలో ఆయన పర్యటించి రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. తూమాటి మాట్లాడుతూ కరేడు రైతుల ఆందోళన ఒక్క ఉద్యమంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. గ్రామాల్లో తిరిగి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి శాసన మండలిలో వినిపించాలని మూడు రోజుల పాటు పర్యటిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు ఎస్సీ, ఎస్టీలు, బీసీకాలనీలు అధికంగా ఉన్న ప్రాంతంలో పర్యటించాను. అందరూ ఏకాభిప్రాయంతో తమ భూములు ఇవ్వమని తెలిపారు. తమకు ఇక్కడ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మంచి వాతావరణంలో ఆరోగ్యంగా జీవిస్తున్నామని చెప్పారు. కులాలు, మతాలు అన్నీ కలిసిమెలిసి జీవిస్తున్నామని, అలాంటి వాతావరణం వదులుకుని తాము బయటకు వెళ్లలేమని తెలిపారు. తాము పొలం ఖాళీ లేకుండా పంటలు పండిస్తామని, ఎంతో మంది కూలీలకు ఉపాధి చూపుతున్నామని తెలిపారు. భూసేకరణ చేస్తున్నట్లు ప్రభుత్వం తమ వద్దకు వచ్చి ఇంత వరకు తెలియజేయలేదని, పేపర్ ద్వారా మాత్రమే తెలుసుకున్నామని, అధికారులు రాలేదని ఆయా గ్రామాల ప్రజలు చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, వైస్ ఎంపీపీ సయ్యద్‌ఫజుల్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, ఎంపీటీసీలు వెంకట రమణయ్య, మాధవరావు, శ్రీహరి, వైఎస్సార్‌సీపీ కరేడు గ్రామ కన్వీనర్ సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, వినయ్‌కుమార్, ఆవుల జయరామ్, సోమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే నాపై అక్రమ కేసులు

- నేను తప్పు చేసినట్లు ఏ ఆధారం ఉన్నా బహిరంగ ఉరికైనా సిద్ధమే
- ఏడాది కిందట చార్జ్‌షీట్ వేసిన కేసులో వాంగ్మూలంతో నన్ను నిందితుడిగా చేర్చుతారా?
- ఎక్సైజ్ శాఖ అధికారులకు దీటుగా కాకాణి సమాధానాలు
- పంటపాళెం మద్యం కేసులో తొలి రోజు విచారణ పూర్తి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నేను అక్రమంగా ఏదైనా ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లుగా ఒక్క ఆధారం చూపించినా, తప్పు చేశానని నేను ఒప్పుకుంటూ న్యాయస్థానం అనుమతితో ప్రజల మధ్యనే బహిరంగ ఉరికైనా సిద్ధమే అంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇందుకూరుపేట ఎక్సైజ్ శాఖ అధికారులకు సవాల్ విసిరారు. ముత్తుకూరు మండలం పంటపాళెంలో మద్యం డంపింగ్ కేసులో కాకాణిని రెండు రోజుల పాటు విచారణ కోసం కోర్టు ఆదేశాలతో శనివారం ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. పోలీస్ శిక్షణా కేంద్రంలో కాకాణి తరపు న్యాయవాది కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలి రోజు 35 ప్రశ్నలు వేసి విచారించారు. ఆయా ప్రశ్నలకు కాకాణి దీటుగా సమాధానమిచ్చారు. 'మద్యం కేసులో కేవలం బెదిరించి తీసుకున్న వాంగ్మూలాలు తప్ప, నిర్దిష్టమైన సాక్ష్యాధారాలు ఉన్నా, నాకు సంబంధం ఉందని చెప్పే వ్యక్తితో మాట్లాడినట్లు ఒక ఆధారం చూపించినా నేనే ఏ శిక్ష వేసినా సిద్ధమే. ఇది రాజకీయ కక్షతో పెట్టిన అక్రమ కేసని, నాకే కాదు మీకూ తెలుసు. ఈ కేసులో నాకు సంబంధం ఉన్నట్లు మీకు తెలిస్తే గతేడాది కాలంగా ఎక్సైజ్ శాఖ విచారణ జరపకుండా కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేసిందా? ఎవరో దారిన పోయే వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలంతో ఈ కేసులో నన్ను నిందితుడిగా చేర్చడం వెనుక రాజకీయ కక్షలే అని తెలుస్తోంది. అక్రమ కేసులో ఇంత కన్నా నేను ఎలా స్పందించగలను. నేను కొత్తగా రాజకీయాల్లోకి రాలేదు 2006లో నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్‌గా, 2014, 2019లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. రాజ్యాంగబద్ధంగా అనుసరించి ఎలా వ్యవహరించాలో క్షుణ్ణంగా తెలిసిన వాడిని. నేను తప్పెలా చేస్తాను. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను తరచూ ప్రశ్నించడంతో నాపై కక్షకట్టి ఇప్పటికి 13 కేసులు నమోదు చేశారు. అందులో భాగంగానే ఈ కేసని చెప్పాలి. మీ దగ్గర నిర్దిష్టమైనా ఆధారం లేకుండానే ఎవరో ఇచ్చిన స్టేట్‌మెంట్ పట్టుకుని వచ్చి ప్రశ్నిస్తే నేనేలా సమాధానం చెప్పగలను' అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చినట్లు న్యాయవాది శ్రీనివాసులు తెలిపారు. విచారణ అనంతరం ఆయన్ను సెంట్రల్ జైలుకు తరలించారు.



భగవంతుడి దయవల్లే.. నా మాంగల్యం నిలబడింది

- ప్రశాంతమ్మా ఇంత పైశాచికమా?
- నా పూజా ఫలంతోనే నా బిడ్డ, నా భర్త బతికి బయటపడ్డారు
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు
- నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి



'ఆ భగవంతుడి దయ, నా పూజఫలం వల్లే నా పసుపు, కుంకుమ, మాంగల్యం నిలబడింది. నా భర్త, నా బిడ్డ బతికి బయట పడ్డారు. డబ్బు, అహంకారం తలకెక్కి మా ఇంటిని రౌడీమూకలతో విధ్వంసం చేసి పైశాచికానందం పొందుతావా?. ఎల్లకాలం రోజులు ఒకేలా ఉండవు.. గుర్తు పెట్టుకో. అధికారం శాశ్వతంగా ఉండదు. ఉందని ఎవరూ మిడిసి పడినా ఆ భగవంతుడే సరైన శిక్ష విధిస్తాడు'

\- మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉబికి వస్తున్న కన్నీళ్లు దాచుకుంటూ తన ఇంట్లో జరిగిన విధ్వంసాన్ని చూపించారు. శనివారం ఆమె సాక్షి ప్రతినిధి వద్ద ఆవేదన వెలిబుచ్చింది.

పైశాచికమా? డబ్బు, అధికార మదమా?

ఒక మహిళ అయి ఉండి, అందులోనూ బాధ్యతాయుతమైన శాసన సభ్యురాలిగా కొనసాగుతున్న నీకు ఇంత పైశాచికమా? అంటూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి గీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీమూకలకు చిల్లర డబ్బులు వెదజల్లి వారితో ఇంట్లోకి చొరబడి దమన కాండ సాగించడం చూసి మహిళా సమాజం సిగ్గుపడుతుందన్నారు. జిల్లా ప్రజలకు ఎంతో మంచి చేసిన, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో గొప్ప విలువలున్న నల్లపరెడ్డి కుటుంబంపై నీవు చేయించిన ఈ వికృత చర్యను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. నీ రౌడీ మూకలు విచక్షణ మరిచి విధ్వంసం సాగించిన సమయంలో అక్కడ నా భర్త, నా బిడ్డ ఉంటే చంపేసే వారని, ఆ క్షణం పరిస్థితులు తలుచుకుంటే గుండె దడ పెరుగుతుందన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజలతోపాటు మా కుటుంబ అభిమానులు చల్లని దీవెనలు ఆశీర్వాదాలు వారిని ప్రాణాలతో నిలబెట్టాయన్నారు. ఈ పైశాచిక దాడి జరిగి ఐదు రోజులు గడిచినా నా భర్త ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. డబ్బు, అధికారంతో పోలీసు యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకుని ఒక మాఫియాలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ అధికారం, డబ్బుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, అది ఎవరికి శాశ్వతం కాదన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. భగవంతుడు చూస్తున్నాడని మనం చేసే తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మా ఇంటి మీద దాడి చేయించి, నా భర్త మీదనే తిరిగి కేసు పెట్టించి ఆనంద పడుతున్నావా? అని నిలదీశారు. మా ఇంటిని మేమే పగులగొట్టుకున్నామని చెప్పడం సిగ్గు చేటన్నారు. ఆ మహిళగా, రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధిగా కంటే.. ఒక మనిషిగా బతకాలని సూచించారు.

అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు

- రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఖాకీలు సెల్యూట్
- మాజీమంత్రి ఇంట్లో దమకాండకు రూ.కోట్ల ప్యాకేజీలు
- జిల్లాలో ఎన్నడూ ఇంత బీభత్సం చూడలేదు



నెల్లూరు (బృందావనం): పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగానికి సెల్యూట్లు చేస్తూ, అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. శనివారం నెల్లూరులో మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో చలపతిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హుందాతనం మరిచి విమర్శలు చేయడమే ఈ రచ్చకు కారణమైందన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డిది మొదటి నుంచి సంపన్న కుటుంబమన్నారు. పర్సం టేజీల్లో ప్రసన్న పీజీ చేశారంటూ విమర్శించడంతోనే, ప్రశాంతిరెడ్డి ఏపీ వ్యాపారాల్లో పీహెచ్‌డీ చేశారో చెప్పారన్నారు. రాజకీయంగా విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణమే, అయితే అత్యంత హేయంగా ఇంటిపై దాడి చేసి బీభత్సం సృష్టించడం ఏమిటని ప్రశ్నించారు. ఆరు దశాబ్దాలుగా రాజకీయాల్లో రాష్ట్రంలోనే పేరొందిన నల్లపరెడ్డి కుటుంబంపై తొలిసారి ఎమ్మెల్యే అయి అధికార, ధన మదంతో గుండాలతో దమనకాండకు పాల్పడడం ప్రజలందరు చూశారన్నారు. ఆ సమయంలో 87 ఏళ్ల వయస్సున్న ప్రసన్న తల్లి, దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సతీమణి శ్రీలక్ష్మమ్మ ఇంట్లో ఉన్నారన్నారు. ఆ రోజు ఆమెకు ఏదైనా జరిగి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు.

రాజ్యాంగం అపహాస్యం

ప్రసన్న ఇంట్లో టీడీపీ గూండాలు దమన కాండకు పాల్పడుతున్నా పోలీసులు వారిని నిలువరించలేదని విమర్శించారు. రౌడీమూకలు విధ్వంసం సృష్టిస్తుంటే బయటకు తరిమి కొట్టారే కానీ ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకోకపోవడం వెనుక పోలీసులకు ముందస్తుగానే సమాచారం ఉందని అర్థమవుతున్నారు. విధ్వంసకాండ జరిగి ఐదు రోజులు గడిచినా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనన్నారు.

మత్స్యకార కుటుంబాలకే కళంకం

నమ్మిన వారికి ప్రాణమిచ్చే మత్స్యకారుల్లో పుట్టిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మి ప్యాకేజీకి అమ్ముడుపోయి కళంకం తెచ్చిందని రాష్ట్ర ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు విమర్శించారు. సముద్ర జలాలపై వేటసాగించి జీవనం సాగించే మత్స్యకారులకు రాజకీయ గుర్తింపును ఇచ్చింది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అనిల్‌బాబు అన్నారు. మూడు రోజుల క్రితం ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వచ్చి మొసలి కన్నీరు కార్చిన జయలక్ష్మి మరుసటి రోజే ప్యాకేజీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు మెచ్చి టీడీపీలో చేరానని చెబుతున్న జయలక్ష్మి కుటుంబానికి రాజకీయ సమాధి తథ్యమని చెప్పారు.

- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నడుస్తోందా? రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందా అనే సందేహం ప్రతి ఒక్కరిలో కలుగుతుందని ఎమ్మెల్సీ మేరిగ మురళి విమర్శించారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి బిస్కెట్ల సమర్పణ



మోపిదేవి: కృష్ణా జిల్లా మోపిదేవిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 2.3 కిలోల వెండి బిస్కెట్లను కందుకూరుకు చెందిన తాళం నితిన్‌కుమార్ కుటుంబసభ్యులు శనివారం సమర్పించారు. స్వామివార్లను దర్శించుకున్న అనంతరం వీటిని ఈఓ దాసరి శ్రీరామవరప్రసాదరావుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబసభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ, వెంకటేశ్వరరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి



సీతారామపురం: పాముకాటుకు మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. వేప చెట్ల వద్ద వేప విత్తనాలను ఏరుకునేందుకు గానూ సింగారెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన అంకి పుష్ప (39) గ్రామానికి చెందిన మరో మహిళతో కలిసి అయ్యవారిపల్లి – దేవిశెట్టిపల్లి మార్గంలోని పొలాల గట్ల వద్దకెళ్లారు. ఈ క్రమంలో విషసర్పం కాటేయడంతో కేకలేస్తూ సహచర మహిళ వద్దకెళ్లి విషయాన్ని చెప్పి అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికుల సాయంలో పుష్పను అయ్యవారిపల్లికి తీసుకొచ్చి 108లో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. కాగా పుష్ప భర్త నెలన్నర క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలికి సంతానం లేరు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మనుబోలు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరుసత్రం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. కొండూరుసత్రం సమీపంలోని పవర్ గ్రిడ్ ఎదురుగా ఓ వ్యక్తి గాయాలతో మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన వాహనచోదకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఎస్సై శివరాకేష్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. శవ పంచనామా నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు యాచకుడై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతూ..



షటిల్ ఆడుతూ..

రెండో రోజూ.. అదే ఉత్సాహం

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రెవెన్యూ క్రీడలు రెండో రోజు శనివారం ఉత్సాహంగా జరిగాయి. క్రీడాకారులతో కలిసి కలెక్టరేట్ టీమ్ తరఫున షటిల్, టెబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీల్లో కలెక్టర్ ఆనంద్ పాల్గొని ఉత్తమ తీరును కనబర్చారు. పలు క్రీడాంశాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకొని బాగా ఆడాలని ప్రోత్సహించారు. డీఆర్వో హుస్సేన్ సాహెబ్, ఆత్మకూరు, కావలి ఆర్డీఓలు పావని, వంశీకృష్ణ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



క్యారమ్స్‌లో గురిచూసి కొడుతూ..



చెస్‌లో ఎత్తుకు పైఎత్తు వేస్తూ..

ఆస్తి కోసమే బిడ్డను కడతేర్చారు



వివాదానికి కారణమైన ఫంక్షన్ హాల్



మృతుడి బంధువులను విచారిస్తున్న పోలీసులు

- కన్నీరుమున్నీరైన తండ్రి
- హత్య ఘటనపై పోలీసుల విచారణ
- నిందితుల కోసం గాలింపు

ఉదయగిరి: ఆస్తి కోసం తన బిడ్డను పక్కా పథకం ప్రకారం కడతేర్చారు.. దగ్గరి బంధువులని చేరదీస్తే పొట్టనబెట్టుకున్నారు.. కారకులైన ఇద్దర్ని ఉరితీయాలని హతుడు మహ్మమద్ హమీద్ తండ్రి విలపిస్తూ పోలీసులను ప్రాధేయపడ్డారు. ఉదయగిరి పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్ ఆస్తి వివాదంలో అక్కడ జనం చూస్తుండగానే హమీద్‌ను వరుసకు బావలైన గుంటుపల్లి ఉమర్ అలీ, హనీఫ్ అత్యంత కిరాతకంగా శుక్రవారం రాత్రి హతమార్చిన విషయం విదితమే. అనంతరం నింపాదిగా స్కూటర్‌పై సివిల్ సప్లయ్స్ గోదాము వద్దకెళ్లి అక్కడ ముందుస్తు పథకం ప్రకారం ఉంచుకున్న కారులో ఉడాయించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. హత్యకు గల కారణాలపై కుటుంబసభ్యులను కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఇంద్రసేనారెడ్డి శనివారం విచారించారు. హత్య జరిగిన సమయంలో ఉన్న పలువురు ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పోస్ట్‌మార్టాన్ని నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా ఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీధర్ పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

అందరూ దగ్గరి బంధువులే..

మృతుడు హమీద్.. నిందితులు ఉమర్ అలీ, హనీఫ్‌కు వరుసకు బావమరిది. ఉదయగిరి మండలం వెంగళరావునగర్‌కు చెందిన వీరి కుటుంబాన్ని కొన్నేళ్ల క్రితం స్వగ్రామం నుంచి తోటి వారు బహిష్కరించారు. దీంతో ఉదయగిరి వచ్చి నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కొండాపురం మండలం కొత్తగరిమెనపెంటకు చెందిన హమీద్ పెద్దమ్మ కుమార్తెతో హనీఫ్‌కు వివాహమైంది. ఈ క్రమంలో హమీద్, ఉమర్ అలీ, హనీఫ్‌కు సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఉదయగిరిలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి యత్నిస్తున్నామని హమీద్‌కు హనీఫ్ చెప్పి భాగస్వామిగా ఆహ్వానించారు. దీంతో రూ.40 లక్షలతో స్థలాన్ని హమీద్ డబ్బులతో కొని హమీద్, హనీఫ్ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇద్దరి పేరుపై ఓ ప్రైవేట్ కంపెనీలో లోన్ తీసుకొని ఈఎంఐలు చెల్లిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌లో హమీద్ ఉంటుండగా, అన్నీ లావాదేవీలను హనీఫ్ చూసేవారు.

అనుమానం ఏర్పడి..

ఉదయగిరిలో ఒకే ఫంక్షన్ హాల్ ఉండటంతో మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో హనీఫ్ లెక్కలు చెప్పకపోడంతో హమీద్‌కు అనుమానం ఏర్పడింది. పైగా ఫంక్షన్ హాల్ తనదే అన్నట్లు హనీఫ్ తన పేరు మాత్రమే రాయించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు పెరిగి పెద్దలు, పోలీసులు, రాజకీయ నేతలు వద్ద పంచాయితీలు జరిగాయి. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఆస్తిపై కోర్టును హమీద్ ఆశ్రయించారు. వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో కార్యక్రమ నిర్వహణకు గానూ హాల్‌నుహనీఫ్, ఉమర్ అలీ బాడుగకిచ్చారు. విషయం తెలుసుకున్న హమీద్ తన స్నేహితులతో కలిసి వచ్చి తాళమేశారు. ఈ క్రమంలో ముందస్తు ప్లాన్ ప్రకారం హనీఫ్, ఉమర్ అలీ దారుణంగా హత్య చేసి పరారయ్యారు.

'మృతుడి భార్యపైనా అనుమానాలు'

మృతుడు హమీద్ ఉదయగిరిలోని బీసీ కాలనీలో వివాహం చేసుకున్నారు. అయితే దంపతుల మధ్య గొడవలున్నాయి. భార్య కరిష్మా కేసు పెట్టడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి తీసేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పెద్దలు ఆర్నెల్ల క్రితం రాజీ కుదిర్చి ఉదయగిరికి కాపురం మర్చారు. అయినా సజావుగా సాగలేదు. ఈ తరుణంలో భార్య పిలుపు మేరకు తన కుమారుడు ఉదయగిరి వచ్చి హత్యకు గురయ్యారని తండ్రి ఆరోపించారు. ఈ ఉదంతంలో కరిష్మా పాత్రపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను సోమవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరబిందో ఫార్మా, భార్గవి ఆటోమొబైల్స్, ఆస్ట్రోటెక్ స్టీల్, ఏపీ జెన్‌కో తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

తల్లీపిల్లల అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): తల్లీపిల్లలు అదృశ్యమైన ఘటనపై కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం వైఎస్సార్‌నగర్‌కు చెందిన మునుస్వామి, శ్వేత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో పిల్లలతో కలిసి ఇంటి నుంచి ఆమె బుధవారం ఎటో వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తులతో బెదిరించి.. నగదు ఫోన్ పే చేయించుకొని

నెల్లూరు(క్రైమ్): నగదు కోసం ఐదుగురు వ్యక్తులు కత్తులతో చంపుతామని వ్యక్తిని బెదిరించి ఫోన్‌పే నుంచి నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న ఘటన తల్పగిరి కాలనీలో శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. వెంకటాచలం మండలం కాకుటూరుకు చెందిన నాగేంద్ర బీవీనగర్‌లోని ఓ బేకరీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారు. స్వీట్స్‌ను తీసుకొని పొదలకూరు రోడ్డులోని ఓ బేకరీకి శుక్రవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బయల్దేరారు. తల్పగిరి కాలనీ వద్ద కొచ్చేసరికి ఐదుగురు వ్యక్తులు అతడ్ని అడ్డుకొని నగదు ఇవ్వాలని, లేకపోతే చంపేస్తామంటూ కత్తులతో బెదిరించారు. ఓ వ్యక్తితో కత్తితో పొడిచేందుకు యత్నించాడు. దీంతో బెదిరిపోయిన నాగేంద్ర తన వద్ద నగదు లేదని, ఫోన్‌పేలో ఉన్నాయని చెప్పి, అందులో నుంచి రూ.ఐదు వేలను నిందితుల్లో ఒకరికి పంపారు. విషయాన్ని ఎవరికైనా చెప్తే అంతుచేస్తామంటూ నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. నిందితుల్లో ముగ్గురి పేర్లు విజయ్, సుధీర్, సిరాజ్ అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ లైవ్:	119
లేయర్ లైవ్:	112
బ్రాయిలర్ చికెన్:	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	240
లేయర్ చికెన్:	190

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి	: రూ.24
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.05